
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 23 అక్టోబరు 2024



ప్రజాభిప్రాయ సేకరణపై ఉత్కంఠ

రామన్నపేట సమీపంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుపై కాలుష్య నియంత్రణమండలి ప్రజాభిప్రాయ సేకరణకు సన్నద్ధమైంది. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటుపై రామన్నపేట మండలవాసులతోపాటు నల్లగొండ జిల్లా చిట్యాల మండల ప్రజలు సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక ప్రజా సంఘాలు, పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. అంతేగాక ప్రజాభిప్రాయ సేకరణపై ప్రజలను వారం రోజులుగా చైతన్యం చేస్తూ పార్టీల నేతలు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాభిప్రాయ సేకరణకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన తెలపాలని పిలుపునివ్వడంతో ఈ మేరకు ప్రజలు సన్నద్ధమవుతున్నారు. దీంతో ప్రజాభిప్రాయ సేకరణపై ఉత్కంఠ నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- 63.8 ఎకరాల్లో రూ.1,400కోట్లతో అంబుజా సిమెంట్ పరిశ్రమకు ప్రతిపాదన
- నేడు ప్రజాభిప్రాయ సేకరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం
- వ్యతిరేకిస్తున్న పార్టీలు, ప్రజాసంఘాలు
- వెల్లువెత్తుతున్న నిరసనలు

గతంలో రామన్నపేట సమీపంలో డ్రైపోర్టు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రైతుల నుంచి 360ఎకరాల భూమిని సేకరించింది. ఆ భూమిలో 63.8 ఎకరాల్లో ఏడాదిలో 6.0మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు అంబుజా కంపెనీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. ఈ నేపథ్యంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలం వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థానిక ప్రజలు, రైతులు నుంచి అధికారులు అభిప్రాయాలను సేకరించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహజ వనరులు ఏమైనా దెబ్బతింటాయా? నీరు, అడవులు, పంటలకు కాలుష్య ముప్పు ఉంటుందా? అనే అంశాలపై ప్రజలు, శాస్త్రవేత్తలు, మేధావుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తారు. ఆ తరువాత అధికారులు, ప్రజల అభిప్రాయం మేరకు సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పాలా? లేదా అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ కార్యక్రమానికి కలెక్టర్, జడ్పీ సీఈవో...

- మిగతా 6వ పేజీలో...

పర్యావరణాన్ని కలుషితం చేసే ఫ్యాక్టరీ



వ్యవసాయంపై జీవనం గడుపుతున్న రైతాంగాన్ని అంబుజా ప్రతినిధులు మోసం చేసి, పచ్చని పంట పొలాలను తక్కువ ధరలకు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో హాని కలిగించే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం దారుణం. పర్యావరణాన్ని కలుషితం చేసే ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుని తీరుతాం.

- అశోక్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు.



పరిశ్రమ ప్రతిపాదిత స్థలం ఎదుట ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జైలుకైనా వెళ్తాం పరిశ్రమను అడ్డుకుంటాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రాజకీయాలకు అతీతంగా పరిశ్రమను పారదోలుతాం
- అఖిలపక్షాల నాయకులు

కాలుష్యకారక సిమెంట్ పరిశ్రమ మాకొద్దు
- ఉరితాళ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వొద్దు
- ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ

8

పరిహారం సరే.. ఇంటిస్థలమేదీ?

- ఆందోళనలో గుట్ట రోడ్డు బాధితులు
- బస్ డిపో ప్రాంతంలో స్థలం కేటాయిస్తూ ఐదేళ్ల క్రితం ప్రొసీడింగ్స్
- కొత్త బస్ డిపో నిర్మాణం చేయకపోవడంతో పాత స్థలంలోనే కొనసాగింపు
- పాత డిపో ప్రాంతం ఖాళీ అయితేనే బాధితులకు స్థలాలు



రోడ్డు బాధితులకు ఇళ్ల స్థలం కేటాయించే ఆర్టీసీ డిపో ఇదే

రాష్ట్రంలో అతిపెద్ద పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట దేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా గత ప్రభుత్వం వైటీడీఏ ద్వారా స్థానికంగా పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఆలయ సింహద్వారానికి ఎదురుగా ఉన్న రోడ్డును విస్తరించింది. అందులో భాగంగా ఈ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్లను తొలగించింది. అందుకు పరిహారంతోపాటు ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని నాటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు నిర్వాసితులకు పరిహారం ఒక్కటే చెల్లించగా, ఇంటి స్థలాల కేటాయింపు ఊసే లేదు.

- ఆంధ్రజ్యోతి, యాదగిరిగుట్ట రూరల్

పాతగుట్ట చౌరస్తా నుంచి ఆలయ సింహద్వారం వరకు రహదారికి ఇరువైపులా చిరువ్యాపారాలు చేసుకుంటూ పలు కుటుంబాలు ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. అయితే యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో ఈ రహదారిని గత ప్రభుత్వం విస్తరించింది. రోడ్డు విస్తరణతో 139 కుటుంబాలు ఇళ్లు, దుకాణాలను పూర్తిగా కోల్పోయారు. వీరికి పరిహారంతోపాటు ఇంటి స్థలాన్ని ఇస్తామని గత సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ తరువాత బాధితులకు పరిహారం ఒక్కటే అందింది. ఇంటి స్థలాన్ని ఇవ్వకపోవడంతో బాధితులు అద్దె ఇళ్లలో ఉంటూ నెలనెలా వేల రూపాయలను అద్దెగా చెల్లిస్తున్నారు. మరోవైపు వీరి ఉపాధి కూడా పోయింది. ఆ తరువాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బాధితులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు మొరపెట్టుకున్నారు. దీంతో 137 మందికి స్థానిక దేవస్థానం కొండకింద ప్రాంతంలో నిర్మించిన దుకాణాల సముదాయంలో మడిగెలను కేటాయించింది. గుట్ట ఆర్టీసీ బస్‌డిపోకు సైదాపురం గ్రామం పరిధిలో స్థలాన్ని కేటాయించారు. అయితే డిపో నిర్మాణానికి రూ.30కోట్లు కేటాయించాల్సి ఉండగా, నేటికీ విడుదల కాలేదు. కొత్త డిపో నిర్మాణం కాకపోవడతో.

- మిగతా 8వ పేజీలో...

మూసీ పునరుజ్జీవం చారిత్రక అవసరం

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు



సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మూసీ పునరుజ్జీవం చారిత్రక అవసరమని, మూసీ ప్రక్షాళన, సుందరీకరణను ప్రజలు కోరుతున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. ఈనెల 27న నిర్వహించనున్న బహిరంగ సభ విజయవంతానికి మంగళవారం హైదరాబాద్‌లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మూసీ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని అంతా స్వాగతించాలన్నారు. సీఎం చేస్తున్న అభివృద్ధిని చూసి, మనుగడ ఉండదని ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు విమర్శలు మాని నిర్మాణాత్మక సూచనలు చేయాలని హితవు పలికారు. మూసీ ప్రక్షాళన కోసం ఈ నెల 27న అడ్డగూడూరు మండలం మానాయకుంట బ్రిడ్జి వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మోత్కూరు, తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్లు గుర్రం కవిత లక్ష్మీనర్సింహారెడ్డి, శాగంటి అనసూర్య రాములు, మోత్కూరు, అడ్డగూడూరు సింగిల్‌విండో చైర్మన్లు పేలపూడి వెంకటేశ్వర్లు, కొప్పుల నిరంజన్‌రెడ్డి, నాయకులు వంగాల సత్యనారాయణ, పి.లింగయ్యయాదవ్ కందాడి సమరంరెడ్డి, తొడుసు లింగయ్య, జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అశోక్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాల సదనం ఘటనపై నిరసనలు
- దోషులను కఠినంగా శిక్షించాలని పలు సంఘాల డిమాండ్
- ఘటనపై విచారణ కమిటీ

7

144 కిలోల గంజాయిని దహనం చేసిన ఎక్సైజ్ పోలీసులు



వరదపాలైన ధాన్యం

రైతులు ఆరుగాలం కష్టపడి సాగుచేసిన ధాన్యం అకాల వర్షానికి వరదపాలైంది. చౌటుప్పల్ పట్టణంలో మంగళవారం సాయంత్రం సుమారు గంటపాటు కురిసిన భారీ వర్షానికి వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. సుమారు 99మంది రైతులకు చెందిన ధాన్యం రాశులు 60 నుంచి 70శాతం మేర తడిచాయి.

- ఆంధ్రజ్యోతి, చౌటుప్పల్ టౌన్



రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీరాందేవ్
- విద్యార్థుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్‌లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నిస్తున్న విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.7,500కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ విద్యార్థికి రూ.20వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.50లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఉపకార వేతనాలను రూ.5వేల నుంచి రూ.20వేల వరకు, ఇంటర్ చదివే విద్యార్థులకు రూ.1,800 నుంచి రూ.15వేలకు పెంచాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ విద్యార్థికి విదేశీ విద్య స్కాలర్‌షిప్ ఇవ్వాలన్నారు. గురుకులాలకు మెరుగైన వసతులతో సొంత భవనాలు నిర్మించడమేగాక, ప్రతీ నియోజకవర్గానికి రెండు గురుకులాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐఐటీ, ఐఐఎం కోర్సులు చదివిన వారికి సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతోపాటు పోటీ పరీక్షల కోసం జిల్లాకు మూడు కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపితే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వట్టె మధు, కరుణాకర్‌రెడ్డి, చందు, బాలాజీ, విజ్జు, జశ్వంత్, మానస, శిరీష, రమాదేవి, ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థిపై దృష్టిపెట్టాలి

కలెక్టర్ హనుమంతు కే.జెండగే



విద్యార్థితో పాఠం చదివిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

రాజాపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఉపాధ్యాయులను ఆదేశించారు. మంళవారం మండల పరిధిలోని పాముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాశగూడెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలల్లో పరిసరాలను పరిశీలించి మౌలిక వసతులు, అమ్మ ఆదర్శ పాఠశాల పెండింగ్ పనులు, మధ్యాహ్న భోజన మెనూ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. నాలుగు, ఆరో తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. పౌష్ఠికాహార లోపం ఉన్న విద్యార్థును గుర్తించి మెనూ ప్రకారం వారికి ఆహారం అందించాలన్నారు. బాల్య దశలోనే సులభతరంగా అర్థమయ్యేలా బోధన ఉండాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దామోదర్, ఎంపీడీవో నాగవేణి, ఎంఈవో చందా రమేష్, ఎంపీవో చంద్రరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణితదితరులు ఉన్నారు.

పోచంపల్లి అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

● 8లో..

నాడు కూలీ..నేడు ఆసామి

● స్ఫూర్తిదాయకంగా అభ్యుదయ రైతు మందడి సిద్ధారెడ్డి ప్రస్థానం
● మూడు ఎకరాల కౌలు నుంచి మొదలై నేడు సొంత 14 ఎకరాల్లో సాగుచేస్తూ..
● ఆయన అవగాహనతోనే సేంద్రీయ సాగు వైపు 100 మంది రైతులు

సేంద్రీయ వ్యవసాయ అంటేనే కష్టంతో కూడుకున్న పని. మరి అందులో విజయం సాధించడంతో పాటు మరో 100 మందిని సేంద్రీయం వైపు మళ్లించాడు భువనగిరి మండలం చందుపట్లకు చెందిన రైతు మందడి సిద్ధారెడ్డి. కూలీగా మొదలైన ఆయన ప్రస్థానం 14 ఎకరాల ఆసామిని చేసింది. అటు చదువుతో పాటు సాగును కూడా విజయపథాన నడిపిస్తూ అభ్యుదయ రైతు అవార్డును అందుకున్నారు. స్వయంకృషితో ఆటుపోట్లను తట్టుకోవచ్చని నిరూపించాడు. రసాయన మందులతో సాగు చేస్తున్న వారికి ఆయన ప్రస్థానం ఓ పాఠం..

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)


పొలాన్ని పరిశీలిస్తున్న సిద్ధారెడ్డి

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల సమీపగ్రామంలోని రైతులందరికీ మందడి సిద్ధారెడ్డి సుపరిచితుడు. తాను చేస్తున్న సేంద్రీయ సాగు వైపు ఇతర రైతులు నడవాలన్న ఆయన తపన అతడు అందరికీ తెలిసేలా చేసింది. ఇది మంచి సాగు పద్ధతి అంటూ విసుక్కోకుండా ఇతరులకు అవగాహన కల్పిస్తూ తన మార్గంలో 100 మంది రైతులను సిద్ధారెడ్డి మళ్లించాడు. మందడి సోమిరెడ్డి, గౌరమ్మల సంతానంలో సిద్ధారెడ్డి రెండోవాడు. 1952 సెప్టెంబరు 9న పుట్టిన ఆయన ఆర్థిక పరిస్థితులతో 8వ తరగతి పూర్తి చేసిన అనంతరం వ్యవసాయ కూలీగా కొనసాగాడు. 1976లో క్రాస్ సంస్థలో చేరి వారి ప్రోత్సాహంతో 1979లో మెట్రిక్ పూర్తిచేశాడు. 1980లో ఓపెన్ యూనివర్సిటీలో బీఏలో ఉత్తీర్ణత సాధించాడు.అదేసమయంలో సంస్థ సౌజన్యంతో అగ్రికల్చర్ కోఆర్డినేటర్‌గా నియమితుడయ్యాడు.

కూలీ నుంచి మొదలై...

చదువులో అంతంత మాత్రంగా ఉన్న సిద్ధారెడ్డి పదేళ్లకు పైగా వ్యవసాయ కూలీగా పనిచేశాడు. సాగుపై పట్టు రావడంతో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు మొదలుపెట్టాడు. చదువుతో పాటు సాగులో మెళకువలతో పంట దిగుబడులు పెంచుకుని ఐదు ఎకరాలు వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. చిరుధాన్యాలు, కూరగాయల సాగు చేపట్టి అంచెలంచెలుగా ఆర్థిక పరిస్థితి మెరుగు పడడంతో ఐదేళ్లలో విడతల వారీగా మరో తొమ్మిది ఎకరాలను కొనుగోలు చేసి 14 ఎకరాలకు యజమానిగా మారాడు. ఎనిమిది ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నాడు. వంకాయ, పచ్చిమిర్చి, బీర, టమాట, కాకరతో పాటు పుంటికూర, మెంతికూర, మినుములు, కందులు, ఉలవలు సాగు పండిస్తున్నారు. రెండు ఎకరాల్లో మామిడి, సపోట, మరో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సాగులో సేంద్రీయ ఎరువులను వినియోగిస్తూ ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధికదిగుబడులు సాధిస్తున్నాడు. క్రాస్ సంస్థ సమగ్ర గ్రామీణ అభివృద్ధిలో పనిచేసిన అనుభవంతో సాగులో ఆయన అనేక మెళకువలను అవగతం చేసుకున్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా విడుదలైన చిరుసంచుల(మినీ కిట్ల)రకాలను, నూతన సాంకేతిక పద్ధతులను పాటించడంలో ముందు ఉన్నారు.



అవార్డు బాధ్యత పెంచింది

కౌలు రైతు నుంచి 40 ఏళ్ల పాటు కష్టపడి 14 ఎకరాలకు యజమానిగా ఎదిగా. సేంద్రీయ సాగులో ప్రతీ అంశంపై పట్టు సాధించి అధికదిగబడులు పొందుతున్నా. తోటి రైతులనూ సేంద్రీయ సాగుకు ప్రోత్సహిస్తున్నా. ఏదేనా అభ్యుదయ రైతు అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచింది.

మందడి సిద్ధారెడ్డి, అభ్యుదయ రైతు

● సామాజిక బాధ్యతగా...

అధిక దిగుబడులు సాధించడమే కాదు, భూసారాన్ని కాపాడటం రైతు బాధ్యతగా సిద్ధారెడ్డి భావిస్తుంటారు. దీంతో సేంద్రీయ వ్యవసాయం వైపు తనతో పాటు ఇతర రైతులు వచ్చేలా అవగాహన కల్పిస్తుంటారు. ఈ క్రమంలో పంటల సాగు చేసుకునేందుకు సూచనలు, సలహాలు చేస్తూ దాదాపు 100 మంది రైతులను సేంద్రీయ పంటల సాగుపై దృష్టి మళ్లించాడు. అదేవిధంగా రైతుల ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా చందుపట్లలో స్టాల్స్‌ను ఏర్పాటుచేసి రైతులకు ఎరువులు, విత్తనాల కొరత తీర్చారు. రైతులు పండించిన కూరగాయలను మంచి ధరకు విక్రయించే విధంగా సంచార రైతు బజారు ఏర్పాటు చేయడంతో రైతులు ఆదాయం సమకూర్చుకునేందుకు కృషి చేశారు. ఆయన చేస్తున్న కృషికి గాను ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఇటీవల 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అభ్యుదయ అవార్డును అందజేసింది. కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి, కమిషనర్ రఘునందన్‌రావు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీ అనిల్‌కుమార్ నుంచి అవార్డును అందుకున్నాడు.


ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి అభ్యుదయ రైతు అవార్డు అందుకుంటున్న సిద్ధారెడ్డి(ఫైల్)

డాక్టర్స్ ఫ్యామిలీ

● ఒకే ఇంటిలో ఆరుగురు వైద్యులు

ఒక ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉంటే ఒకరు డాక్టర్, మరొకరు ఇంజనీర్, మరొకరు ఇతర రంగాల్లో ఉంటారు. కానీ యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన ఎండీ అబ్దుల్‌నబీ, జహిరున్నీసా దంపతుల ముగ్గురు పిల్లలు (ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె) వైద్యులు కావడంతో పాటు వారి కోడళ్లు కూడా డాక్టర్లే కావడం విశేషం. దీంతో వారు డాక్టర్స్ ఫ్యామిలీగా పేరొందారు.

(ఆంధ్రజ్యోతి- మోత్కూరు)


ఎండి అబ్దుల్‌నబీ


ఎండీ షఫికురెహమాన్, అఫ్సియారూహి


ఫసిఉర్‌రెహమాన్, సోహెలాముబషీర్


షబనా తస్లీమ్

మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన ఎండీ జమాలొద్దీన్‌కు ఇద్దరు కుమారులు. ఆయన గాజుల వ్యాపారం చేసేవారు. మోత్కూరులో ఆయనొక్కరే గాజులు విక్రయించేవారు. దీంతో ఆయన గాజుల జమాల్‌గా ప్రసిద్ధి. ఆయన కుమారుల్లో పెద్దకుమారుడు అబ్దుల్‌నబీ వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఎల్ఎస్‌ఏగా ఉద్యోగ విరమణ చేశాడు. రెండో కుమారుడు హుస్సేన్ బోరు బండి హ్యామర్‌కు సంబంధించిన బిట్లు ఇతర పరికరాల వ్యాపారం చేసేవాడు. అబ్దుల్‌నబీ, జహిరున్నీసా దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. అబ్దుల్‌నబీ వెటర్నరీ ఉద్యోగం చేస్తున్నప్పుడు వేతనాలు తక్కువగా ఉండి పిల్లల చదువులకు ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. జహిరున్నీసా భర్త సహకారంతో కోళ్ల ఫాం నిర్వహించేది. పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నది వారి లక్ష్యం. వారి పిల్లలు ముగ్గురూ మోత్కూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించారు. ఇంటర్ కార్పొరేట్ కళాశాలలో చదివినప్పటికీ లాంగ్‌టర్మ్ కోచింగ్ లాంటివి లేకుండానే ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సాధించి వైద్యకళాశాలల్లో ప్రభుత్వ కోటా సీట్లు సాధించారు.

అందరూ వైద్యులే...

పెద్దకుమారుడు ఎండీ షఫికుర్‌రెహమాన్ ఎంబీబీఎస్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో, ఎండీ(జనరల్ మెడిసిన్) కాకతీయ కళాశాలలో, డీఎం (న్యూరో) నిమ్స్‌లో పూర్తిచేశారు. ఆయన ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్నారు. రెండో కుమారుడు ఫసిఉర్‌రెహమాన్ ఎంబీబీఎస్ దక్కన్ మెడికల్ కళాశాలలో పూర్తి చేసి, నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తూ ఎండీ(రేడియాలజీ) ఉస్మానియాలో చేస్తున్నారు. కుమార్తె షబనాతస్లీమ్ ఎంబీబీఎస్ దక్కన్ మెడికల్ కళాశాలలో పూర్తి చేసి, వనపర్తి జిల్లా వీపనగండ్ల పీహెచ్‌సీలో డాక్టర్‌గా సేవలందించింది. ప్రస్తుతం కోఠిలోని మెటర్నిటీ ఆస్పత్రిలో ఎండీ(గైనకాలజీ)చేస్తోంది.

ఇద్దరు కోడళ్లూ వైద్యులే

పెద్దకోడలు అఫ్సియారూహి ఎంబీబీఎస్ ఉస్మానియా మెడికల్ కళాశాలలో, ఎండీ(పీడియాట్రిక్) కాకతీయ మెడికల్‌కళాశాలలో, డీఎం(ఎండోక్రైనాలజీ) ఉస్మానియాలో పూర్తి చేసింది. ప్రస్తుతం ఆమె భర్త షఫికుర్‌రెహమాన్‌తో పాటు దుబాయ్‌లో ఉంటోంది. చిన్నకోడలు సోహెలాముబషీర్ షాదాన్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఈఎస్ఐ మలక్‌పేట ఆస్పత్రిలో వైద్యురాలిగా పని చేస్తున్నారు. సామాన్యకుటుంబంలో జన్మించినా ఎంబీబీఎస్ సీట్లు సాధించి, అందులో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నాణెం 'పది'లమే!

● 10 నాణెం చెలామణిలో గందరగోళంపై రంగంలోకి ఆర్‌బీఐ
● నాణేలను తీసుకోవాలని విస్తృత ప్రచారం
● సందేహాల నివృత్తికి 14440 టోల్‌ఫ్రీ నెంబరు



భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పది రూపాయమల నాణెం చెలామణిలో సందేహాలను తీర్చడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) రంగంలోకి దిగింది. ఈ నాణేలను ఎవరూ తీసుకోకపోవడం, చెల్లవంటూ విస్తృత ప్రచారం జరగడంతో చాలామంది వద్ద పది నాణేలు అలాగే ఉండిపోయాయి.అయితే ఈ నాణేలు పూర్తిగా చెల్లుబాటు అవుతాయని, వాటి వాడకంలో ఎలాంటి సందేహాలు వద్దని ఆర్‌బీఐ చెబుతోంది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా మెసేజ్‌లు ఇస్తోంది. రూ.10, రూ.20 నాణేలను ఎవరైనా తిరస్కరిస్తే మూడేళ్ల జైలు శిక్ష తప్పదని హెచ్చరిస్తోంది. ఎవరైనా అభ్యంతరాలు, సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 14440కు మిస్డ్ కాల్ ఇవ్వాలని పేర్కొంది. నాణేలపై 30గీతలు ఉన్నా చెల్లుబాటవుతాయని ఆర్‌బీఐ తెలిపింది. ముఖ్యంగా రూ.10 నాణేలను తీసుకోవాలని ఆర్‌టీసీ కండక్టర్లు, డ్రైవర్లను సంస్థ యాజమాన్యం ఆదేశించింది. బ్యాంకు కార్యాలయాల ప్రాంగణంలో రూ.10 నాణేల చెల్లుతాయని పోస్టర్లను, ఫ్లెక్సీలను అధికారులు ప్రదర్శిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



పది రూపాలయ నాణేలు చెల్లుబాటవుతాయని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. అపోహలను నమ్మవద్దని, నిరభ్యతరంగా నాణేలను తీసుకోవచ్చు. వినియోగదారుల్లోనూ చైతన్యం తెస్తున్నాం.

సీత శ్రీనివాస్, సీఈవో, ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు

అసలెందుకీ పరిస్థితి

కేంద్రం రూ.1000, రూ.500 రద్దు చేసి వాటి స్థానంలో రూ.2వేలు, రూ.500 నోట్లు విడుదల చేశారు. దీంతో ఎక్కువ మొత్తంలో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు పది రూపాయల నాణేన్ని చెలామణిలోకి తీసుకొచ్చారు. బ్యాంకు ఖాతాల నుంచి నగదు ఉపసంహరించినప్పుడు ఎక్కువ మొత్తంలో నాణేలను ఖాతాదారులకు ఇచ్చారు. ఈ బరువు మాకెందుకు అని చాలా మంది వదంతులకు తెరలేపారని కొందరు అంటున్నారు.

నాణేల చెలామణిపై అవగాహన పెంచాలి

పది రూపాయల నాణేల చెలామణిపై ఆర్‌బీఐ మరింతగా ప్రచారం నిర్వహించాలని ది పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో బ్యాంకు ఆధ్వర్యంలో పది రూపాయల నాణేల చెలామణిపై అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీఈవో సీత శ్రీనివాస్, వైస్‌చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్, కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అడవు లు, వాతావరణశాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు హాజరుకానున్నారు.

పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

రామన్నపేటలో ఏర్పాటుచేయనున్న అంబుజ సిమెంట్ ఫ్యాక్టరీతో గాలి, నీటి వనరులు, వ్యవసాయ భూములకు హాని చేకూరుతుందని స్థానికులు వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. కలెక్టరేట్‌తో పాటు మండలకేంద్రంలో పలు పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. పరిశ్రమ ఏర్పాటుతో రామన్నపేట చుట్టూ ఉన్న 10 గ్రామాలకు వాతావరణ కాలుష్య ముప్పు ఉందని నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా పరిశ్రమ ఏర్పాటును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హాని కలిగించే ఫ్యాక్టరీ వద్దు



ప్రజలకు హాని కలిగించే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని తక్షణమే నిలిపివేయాలి. ప్రభుత్వం చొరవతీసుకొని సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వవద్దు. ప్రజాభిప్రాయ సేకరణలో ఫ్యాక్టరీ ఏర్పాటును ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలి. ప్రాణాలకు ముప్పు తెచ్చే ఫ్యాక్టరీని నిర్మించొద్దు.

సాల్వేరు అశోక్, మాజీ ఎంపీటీసీ, రామన్నపేట

కట్టుదిట్ట భద్రత

సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ పలు పార్టీలు, ప్రజాసంఘాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో బుధవారం రామన్నపేటలో చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం కట్టుదిట్ట ఏర్పాట్లు చేసింది. ప్రజలంతా తమ.. అభిప్రాయాలను చెప్పేలా, సభలో ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు పోలీసు అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ వేదికను మంగళవారం పరిశీలించారు. రామన్నపేటతోపాటు పలు గ్రామాల ప్రజలు ఇక్కడి రానున్నండటంతో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి ఆందోళనలు చేపట్టకుండా, నిరసనలు శాంతియుతంగా తెలియజేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే స్థానికులతో పాటు పలుపార్టీల నేతలు ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ఆందోళనలు చేపట్టే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో పోలీసు బలగాలను పెద్దసంఖ్యలో మోహరించే అవకాశం ఉంది.

'నా బిడ్డను నాకే ఇవ్వాలి'

● సీడబ్ల్యూసీ సిబ్బంది కాళ్లు మొక్కి వేడుకున్న పెంచిన తల్లి
● శిశువును అప్పగించేందుకు ససేమిరా

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'నా బిడ్డను నాకే ఇవ్వాలి' అంటూ పెంచిన తల్లి బాలల పరిరక్షణ రక్షణ విభాగం (సీడబ్ల్యూసీ) సిబ్బంది కాళ్లు మొక్కి వేడుకుంది. తన ఒడి నుంచి శిశువును తీసుకునేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో చేసేదేమీలేక చిన్నారి సహా ఆమెను సఖి కేంద్రానికి తరలించారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువవనగిలో ఈ సంఘటన జరిగింది.

మూడో కాన్పులో ఆడ శిశువే కావడంతో..

తుర్కపల్లి మండలం రామాపురంతండాకు చెందిన ఓ జంటకు రెండు నెలల క్రితం మూడో కాన్పులో ఆడ శిశువు జన్మించింది. ఆ జంటకు కూడా అప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. దీంతో మూడో కుమార్తెను సాకలేమంటూ తెలిసిన వారి ద్వారా సిద్దిపేటకు చెందిన ఓ జంటకు రెండు నెలల క్రితమే అప్పగించారు. ఈ మేరకు శిశు విక్రయం జరిగిందంటూ మంగళవారం వచ్చిన సమాచారంతో జిల్లా బాలల సంరక్షన విభాగం(సీడబ్ల్యూసీ), అంగన్‌వాడీ టీచర్లు అప్రమత్తమై జన్మనిచ్చిన, సాదుకుంటున్న తల్లిదండ్రులను గుర్తించి సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టారు. దీంతో శిశువును సఖి కేంద్రానికి తరలించారు. ఇద్దరికీ వేర్వేరుగా కౌన్సెలింగ్ చేశారు. అయితే శిశువును సఖి కేంద్రానికి తరలిస్తున్న క్రమంలో పెంచిన తల్లి రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. 'నా బిడ్డను నాకే ఇవ్వాలి' అంటూ కార్యాలయంలోని అందరి కాళ్లు మొక్కుతూ బోరుమంటూ విలపించింది. ఒడి నుంచి శిశువును తీసుకునేందుకు సిబ్బంది చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించింది. దీంతో శిశువు సహా పెంచిన తల్లిని సఖి కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం విచారణ నిర్వహించాలని నిర్ణయించారు. పెంపకం తండ్రి తల్లడిల్లుతూనే భార్యను ఓదారుస్తూ 'అధికారికంగానే మన కూతురిని మనం తెచ్చుకుందాం' అంటూ నచ్చచెప్పిన తీరు అందరినీ కలచివేసింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపనున్నట్లు, జిల్లా సంక్షేమ అధికారి నర్సింగ్‌రావు, సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, డీసీపీవో పి సైదులు తెలిపారు.

మరో శిశువు శిశుగృహకు తరలింపు...

తుర్కపల్లి మండలం వాసాలమర్రికి చెందిన ఓ జంటకు వారం రోజుల క్రితం భువనగిరిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మూడో కాన్పులో ఆడ శిశువు జన్మించింది. అయితే ఆ జంటకు అప్పటికే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడో కాన్పులో మగసంతానం కోసం ఎదురు చూసినప్పటికీ ఆడ శిశువే జన్మించింది. దీంతో తమ పేదరికంపై అప్పటికే గుబులుగా ఉన్న ఆ జంట మూడో కుమార్తెను సాకి పెద్దయ్యాక పెళ్లి చేయలేమనే నిర్ణయంతో తమకే తెలిసిన పిల్లలు లేని ఓ జంటకు పెంచుకునేందుకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అయితే శిశు విక్రయ ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ వచ్చిన సమాచారం మేరకు జిల్లా బాలల పరిరక్షణా విభాగం, చైల్డ్ లైన్ యంత్రాంగం అప్రమత్తమై ఆ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేయడంతో ఆ శిశువును సీడబ్ల్యూసీ ముందు ప్రవేశపెట్టి సాకలేమంటూ స్త్రీ, శిశు సంక్షేమశాఖకు అప్పగించారు. దీంతో ఆ చిన్నారిని హైదరాబాద్‌లోని శిశు గృహకు తరలించారు.

బుద్ధవనానికి ప్రాధాన్యం ఇవ్వడం గర్వకారణం


బుద్ధవనం స్టాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, పక్కన పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

నాగార్జునసాగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బుద్ధవనానికి ప్రాధాన్యమిస్తూ రామప్ప ఆలయం, గోల్కొండ కోటలతో ఏర్పాటుచేసిన స్టాల్‌ను కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంభించడం గర్వకారణమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో మంగళవారం జరిగిన ట్రావెల్ ట్రేడ్ ఫెయిర్‌లో రాష్ట్రం తరుపున ఏర్పాటు చేసిన బుద్ధవనం స్టాల్‌ను మంత్రి ప్రారంభించినట్లు రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని బుద్ధవనం సందర్శనకు ఆహ్వానించగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. బుద్ధవనం విశేషాలను కేంద్ర మంత్రికి కన్సల్‌టెంట్ ఈమని శివనాగిరెడ్డి వివరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడడల్లో రాణిస్తే భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఎంజీయూ వీసీ ఆచార్య అల్తాఫ్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం ఎంజీయూలో ఏర్పాటుచేసిన అంతర విశ్వవిద్యాలయాల తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు క్రీడాప్రతిభను ప్రదర్శించి విజేతలుగా నిలవాలన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను విజేతలుగా ప్రకటించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యదర్శి డాక్టర్ హరీష్‌కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య అలవ్వాల రవి, మురళీ, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పదిల జ్ఞాపకంలా..




నూతన భవనం, గతంలోని పాతభవనం

అమ్మనాన్నల జ్ఞాపకార్థం ఖరీదైన భవంతి
అన్ని హంగులతో నిర్మిస్తున్న కుమారుడు

అక్కడ పచ్చని తోట.. చుట్టూ టేకు, కొబ్బరి చెట్లతో ఆహ్లాదకర వాతావరణం. చూడగానే మనస్సుకు ప్రశాంతత చేకూరేలా పరిసరాలు. వాటి మధ్య అన్ని హంగులతో ఓ భారీ చతురస్రపు ఖరీదైన భవనం.. ఇదేదో సినిమా సెట్టింగ్ అనుకుంటే పొరపాటే. ఇది అచ్చమైన పూర్వపు కాలం నాటి నమూనాలో నిర్మించిన నాలుగు దర్వాజాల(మండువా) చతురస్రపు భవనం. తన అమ్మ నాన్నల జ్ఞాపకాలు పదిలంగా ఉండే విధంగా పాత కాలం నాటి నమూనాలో ఉన్న ఈ భవనాన్ని నిర్మించాడు ఓ కుమారుడు.

(ఆంధ్రజ్యోతి-రాజాపేట)

యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన శీలం చిన లింగారెడ్డి, రుక్కమ్మ దంపతులకు ఎనిమిది మంది సంతానం. వీరిది ఉమ్మడి వ్యయవసాయ కుటుంబం. లింగారెడ్డి సీపీఐ నాయకుడిగా కొనసాగి గ్రామ సర్పంచ్‌గా కూడా పనిచేశారు. లింగారెడ్డి వృద్ధాప్యంతో 1992లో మృతిచెందారు. ఆయన భార్య రుక్కమ్మ 1997లో మృతి చెందారు. వారి కుమారుడు ఏడో సంతానం శీలం అశోక్‌రెడ్డి 30సంవత్సరాలుగా హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. తన అమ్మనాన్నల జ్ఞాపకాలు పది కాలల పాటు పదిలంగా ఉండే విధంగా గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో పాత కాలం నాటి నమూనాలో భవనాన్ని నిర్మిస్తున్నారు. అన్నదమ్ముళ్లు, అక్కలు కుటుంబసభ్యులతో కలిసి ప్రతి పండగకు గ్రామానికి వచ్చి కలుస్తుంటారు.


నిర్మాణం ఇలా..

333 గజాల స్థలంలో, ఎనిమిది గదులు, వంట గది, పూజా మందిరంతో భవనం నిర్మిస్తున్నారు. ప్రతి రోజూ ఇక్కడ 20 నుంచి 30 మంది కార్మికులు పనిచేస్తున్నారు. మహారాష్ట్ర, యూపీ, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఈ భవనానికి రాజస్థాన్ కోటరాయి, వేప ప్లేయుడ్‌ను వాడుతున్నారు. 32 మొగురాల (గుంజలు)తో చతురస్రపు ఆకారంలో నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం ఎంతో ఖరీదైనదిగా పలువురు పేర్కొంటున్నారు.


ఇంటిలోపల గతంలో మాదిరిగా..



అమ్మనాన్నల జ్ఞాపకం కోసమే..



అమ్మనాన్నల జ్ఞాపకం కోసం చతురస్రపు భవానాన్ని నిర్మించుకుంటున్నాం.పూర్వపుకాలం నాటి నమూనాలో నిర్మిస్తున్నాం, ఈ భవనంతో పూర్వికులు గుర్తుకొస్తున్నారు. అమ్మ నాన్నల జ్ఞాపకాలు ఎప్పటికీ ఉండాలని ఈ భవనాన్ని నిర్మించాం.

- శీలం అశోక్‌రెడ్డి, న్యాయవాది

క్రైం పాయింట్
Crime point

తహసీల్దార్ జయశ్రీకి బెయిల్ నిరాకరణ

● ఏ2గా ఉన్న ధరణి మాజీ ఆపరేటర్ జగదీ‌ష్‌కు బెయిల్

హుజూర్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో ప్రభుత్వ భూముల బదలాయింపులో అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి తహసీల్దార్ జయశ్రీకి హైకోర్టు బెయిల్ తిరస్కరించింది. మంగళవారం వాదనలు విన్న హైకోర్టు ఈ నెల 25కు వాయిదా వేసింది. అదే కేసులో ఏ2గా ఉన్న ధరణి మాజీ ఆపరేట్ వత్సవాయి జగదీ‌ష్‌కు మంగళవారం హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీప్రసాద్ బెయిల్ మంజూరు చేశారు. రూ.10వేల పూచికత్తుతో పాటు ఇద్దరు వ్యక్తుల జామీన్‌తో బెయిల్ మంజూరు చేశారు. ప్రతి శనివారం హుజూర్‌నగర్ పోలీ‌స్‌స్టేషన్‌లో హాజరు కావాలని పలు నిబంధనలతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. తహసీల్దార్‌ను పోలీసులు నాలుగు రోజుల కస్టడీలోకి తీసుకొని విచారించారు. కాగా హుజూర్‌నగర్ సబ్‌జైలులో ఉన్న తహసీల్ధార్ హుజూర్‌నగర్ కోర్టులో కాకుండా హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేయగా రెండుసార్లు తిరస్కరించారు. పోలీసుల కస్టడి ముగిసినందున ఈ నెల 25న హైకోర్టులో బెయిల్ వచ్చే అవకాశముందని ఆమె తరుపు న్యాయవాది చల్లా కృష్ణయ్య తెలిపారు. బూరుగడ్డ గ్రామంలో 36.23 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేట్‌గా పనిచేసిన వత్సవాయి జగదీష్ తల్లి,చెల్లి, ఇతర కుటుంబ సభ్యుల పేరుమీద బదలాయించి రూ.14లక్షల 65వేలు రైతుబంధు పేరుతో నిధులు డ్రా చేశారు. కాగా ఈ విషయంపై సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి విచారణ చేసి అప్పటి హుజూర్‌నగర్ తహసీల్ధార్ జయశ్రీని, ధరణి ఆపరేటర్ జగదీ‌ష్‌ను రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె హుజూర్‌నగర్ సబ్‌జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

మిర్యాలగూడ లీగల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భూమి పంచాయితీని మనసులో ఉంచుకొని హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానం జైలు శిక్ష, జరిమానా విధించింది. నల్లగొండ జిల్లా అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల చినజంగారెడ్డిపై హత్యానేరం రుజువుకావడంతో యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి. వేణు మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన అన్నద మ్ముళ్లు అలుగుల పెదవెంకట్‌రెడ్డి, అలుగుల చినజంగారెడ్డిల మధ్య భూమి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో 2018 జూన్ 12న పెదవెంకట్‌రెడ్డి తన వ్యవసాయ పొలంలో కత్తి పోట్లకు గురై చనిపోయి ఉన్నాడు. మృతుడి భార్య కనకదుర్గ తన భర్తను మరిది జంగారెడ్డి హత్య చేశారని అనుమానిస్తూ హాలియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. హాలియా ఎస్ఐ బి.సతీష్ జంగారెడ్డిపై కేసు నమోదు చేసుకోని దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి సీఐ కె. ధనుంజయ దర్యాప్తు పూర్తిచేసి నిందితుడు చినజంగారెడ్డిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ ప్రవేశపెట్టిన సాక్ష్యులను విచారించిన న్యాయస్థానం నిందితుడు తన సోదరుడైన పెదవెంకట్‌రెడ్డిని కావాలనే హత్య చేశాడని నిర్ధారిస్తూ జంగా రెడ్డికి జీవిత ఖైదు, జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అద నంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరుపున ఇన్‌చార్జి అడిషనల్ పీపీ వెంకటరమణెడ్డి కేసు వాదించారు. ప్రాసిక్యూషన్‌కు కోర్టు లైజన్ అధికారి చెరుపల్లి సైదులు సహకరించారు.

సూర్యాపేటలో మూడు ఇళ్లలో చోరీ

సూర్యాపేటక్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంగళవారం మూడు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన గుమ్మడవెల్లి రాకేష్ తన సోమవారం రాత్రి కిరాణషాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. అదే రాత్రి దొంగలు షట్టర్ తాళాలు పగులగొట్టి షాపులో ఉన్న రూ.60వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో నివాసముండే జనార్ధన్ ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇంటి తాళం పగులగొట్టి రూ.6వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో ఉన్న మారగంటి రోజా ఇంట్లో తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు ఉదయం చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

అప్పులబాధ తాళలేక వ్యక్తి బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక పురుగులమందు తాగి వ్యక్తి బలన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం జరిగింది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామానికిచెందిన జొన్నపాల ముత్తయ్య(45) పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఎస్వీ కన్వెన్షన్ నైట్ వాచ్‌మన్‌గా పనిచేస్తూ, తన భార్య పిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నాడు. నైట్‌వాచ్ ముత్తయ్య అప్పుల భారంతో ఇబ్బంది పడుతున్నాడు. కుటుంబాన్ని సైతం పోషించలేక మనస్తాపం చెంది మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తికలిగి మంగళవారం ఉదయం క్రిమిసంహారక మందు సేవించి కన్వెన్షన్‌లోని తన గదిలోకి వచ్చి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. గమనించిన భార్య 108కు సమాచారం ఇవ్వగా, సిబ్బంది స్థానిక ఏరియా ఆస్పత్రికి చికిత్సనిమిత్తం తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. ముత్తయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్సపొందుతున్న శివమణి

సూర్యాపేటక్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడు. సోమవారం రాత్రి సూర్యాపేట ప్రభుత్వ బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఈ సంఘటన జరిగింది. మేళ్లచెర్వుకు చెందిన విద్యార్థి శివమణి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతిగృహంలో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టూ పక్కల వారు గమనించి వారించడంతో విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో విద్యార్థిని మొదట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి చికిత్సకోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

కోతుల దాడిలో ముగ్గురికి గాయాలు

మోటకొండూరు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని ఆరెగూడెం గ్రామంలో మంగళవారం కోతులు గ్రామస్థులపై దాడి చేశాయి. గ్రామానికి చెందిన కొల్లూరి లక్ష్మి, నర్సింహులు, బర్ల సువర్ణలపై కోతుల గుంపు ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో తీవ్ర గాయాలైన వారు మండలకేంద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకున్నారు. నెల రోజుల వ్యావధిలోనే కోతుల దాడిలో సుమారు 20 మందిపై గాయపడినట్లు సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం తెలిపారు. కోతులు ఇళ్ల మధ్యలో సంచరిస్తుండడంతో గ్రామస్థులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నామని గ్రామస్థులు తెలిపారు.

బాల సదనం ఘటనపై చర్యలేవీ?

● దోషులను కఠినంగా శిక్షించాలని పలు సంఘాల డిమాండ్ ● మహిళా మోర్చా ఆధ్వర్యంలో భువనగిరిలో ఆందోళన


భువనగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న మహిళా మోర్చా నాయకులు

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని బాల సదనం నిర్వాహణలో, బాలల సంరక్షణలో నెలకొన్న లోపాలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. బాలసదనంలో 10రోజుల క్రితం బాలికలపై జరిగిన లైంగిక వేధింపుల ఘటనపై నిరసనలు వెల్లువెత్తున్నాయి. నిందితుడు వెంకట్‌రెడ్డిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నిందితుడు ప్రస్తుతం జైలులో ఉన్నాడు. సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని వివిధ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

డీసీపీకి సామాజిక కార్యకర్తల ఫిర్యాదు

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలో కొనసాగుతున్న బాల సదనంలో జరిగిన ఘటనలపై సామాజిక కార్యకర్తలు మంగళవారం డీసీపీ రాజే‌ష్‌చంద్రకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్దంగా ఈ నెల 14న రాత్రిపూట బాల సదనంలోకి అనుమతించడం, బాలికలపై జరిగిన లైంగిక వేధింపులపై వారం రోజుల పాటు గోప్యత పాటించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికల లైంగిక వేధింపుల ఘటనలపై అధికారులు ఉద్దేశపూర్వకంగానే సంఘటన జరిగిన రోజునే పోలీసులకు ఫిర్యాదు చేయలేదని డీసీపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు తాళ్లపల్లి చంద్రశేఖర్, కొడారి వెంకటేష్, ఎండి ఇస్తియాక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఆడపిల్లలకు భద్రత కరువు : బీజేపీ మహిళా మోర్చా

కాంగ్రెస్ పాలనలో ఆడపిల్లలకు భద్రత కరువైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురిచంద్ర అన్నారు. బాలసదనం ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలసదనంలో బాలికలపై లైంగిక వేధింపులకు గురకావడం దారుణమాన్నారు. బాలసదనంలోకి రాత్రి పురుషుల ప్రవేశానికి అనుమతి ఇచ్చిన, జరిగిన ఘటనపై వారం రోజులపాటు గోప్యత పాటించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీవో సైదులను విధులనుంచి తొలగించాలన్నారు. ముందుగా మహిళా మోర్చా బృందం బాలసదనాన్ని సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేసింది. బాలసదనంలో బాలికలతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగురాని శ్రావణి, పట్టణ అధ్యక్షురాలు యంజాల మల్లిక, లక్కాకుల మాధవి, మందుల లక్ష్మీ, బూరుగు లాస్య బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్, నరేష్, మంగు నరసింహరావు, రాళ్లబండి కృష్ణాచారి, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఘటనపై విచారణ కమిటీ

భువనగిరిలోని బాలసదనంలో ఈ నెల 14న బాలికలపై లైంగిక వేధింపుల ఘటనలపై విచారణ కమిటీని నియమించినట్లు జిల్లా సంక్షేమ అధికారి నర్సింగ్‌రావు మంగళవారం తెలిపారు. ఐసీడీఎస్ భువనగిరి ప్రాజెక్టు సీడీపీవో శైలజ విచారణ కమిటీ అధికారిగా నియమించినట్లు తెలిపారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయి విచారణ, సంఘటన జరిగిన రోజున బాలసదనంలో ఉన్న అందరి వాగ్మూలాలు నమోదు చేసారని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. వేధింపుల ఘటనలో నిందితుడైన వెంకట్‌రెడ్డిని పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. లైంగిక వేధింపుల ఉదాంతంలో దోషులుగా తేలిన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హైకోర్టు ఆదేశాలతో గోడ కూల్చివేత


గోడను కూల్చుతున్న అధికారులు.

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలోని జేత్యాతండా గ్రామంలో రెండు కులాల మధ్య బేధాభిప్రాయం రావడంతో 40 సంవత్సరాల నుంచి నడిచే రోడ్డుకు అడ్డంగా ఓ కులస్థులు గోడ కట్టారు. దీంతో గ్రామంలో కొంతకాలంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి.. వెళ్తే జేత్యాతండా గ్రామంలో గిరిజనకాలనీ నుంచి బీసీ కాలనీకి పురాతనం నుంచి రోడ్డు ఉంది. అదే రోడ్డును గత సర్పంచ్ కాలంలో సీసీరోడ్డు వేసి అభివృద్ధి చేశారు. కాగా గిరిజనులు ఆ రోడ్డు నుంచి బీసీలు నడవవద్దని రోడ్డుకు అడ్డంగా ఆరు నెలల క్రితం గోడ కట్టారు. బీసీ కాలనీకి వెళ్లేందుకు ఆ రోడ్డుకు ప్రత్యామ్నాయం లేదు. దీంతో బీసీకాలనీ వాసులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా సమస్య సమస్యగానే మిగిలిపోయింది. సమస్య తీరకపోవడంతో కొంత కాలంగా గ్రామంలో రెండు కులాల మధ్య అశాంతి నెలకొంది. దీంతో బీసీలు న్యాయ పోరాటానికి దిగారు. హైకోర్టులో పిటిషన్ వేయడంతో కోర్టు విచారణ జరిపి గోడను కూల్చి వేయాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఆదేశాలు జారీ చేసింది. గోడను తొలగించాలని కలెక్టర్ మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్‌ను ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎల్‌పీవో రాఘవరావులు పోలీసులు బందోబస్తుతో మంగళవారం ఉదయం గోడ కూల్చేందుకు గ్రామానికి వెళ్లారు. కాగా గిరిజన మహిళలు అడ్డుకొని గోడ కూల్చితే పురుగుల మందు తాగుతామని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. విషయాన్ని కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించగా హైకోర్టు ఆదేశాలు అమలు చేయాల్సిందేనని గట్టిగా చెప్పడంతో సాయంత్రం అధికారులు గ్రామానికి వెళ్లి ఈ విషయంలో కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని వారికి నచ్చజెప్పడంతో ఎట్టకేలకు గోడ కూల్చేందుకు గిరిజనులు సహకరించారు. దీంతో ఎక్సకవేటర్ సహాయంతో గోడను కూల్చి వేశారు. దీంతో ఆరు నెలలుగా సంచలనంగా మారి రోడ్డు అడ్డు గోడను ప్రశాంతంగా కూల్చి వేయడంతో అధికారులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా అవంతీపురం గ్రామంలో ఆర్అండ్‌బీ పరిధిలో నిర్మించిన గృహాన్ని తహసీల్దార్, రూరల్ పోలీసుల సమక్షంలో తొలగించారు. నిర్మాణాన్ని కూల్చి వేసే సమయంలో బాధితురాలు ఆందోళన చేశారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సహకరించడంతో ఆందోళన విరమించింది. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ సత్యనారాయణ, ఎంపీడీవో శేషగిరిశర్మ, సీఐ వీరబాబు, ఎస్ఐ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఎలాంటి వ్యవసాయ, ఇతర గృహ నిర్మాణ భూమిలేని నిరుపేద కుటుంబానికి చెందిన నన్ను ప్రభుత్వం ఆదుకోవాలి. కూలీ పనులతో జీవనం సాగిస్తున్న నేను చిన్నపాటి హోటల్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్న సందర్భంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటి నిర్మాణాన్ని అధికారులు తొలగించడం బాధాకరం. ప్రభుత్వం నిరుపేదలకు అందించే గృహ నిర్మాణ సౌకర్యం, ఇంటి స్థలాన్ని కేటాయించి నా కుటుంబానికి ఆసరా కల్పించాలి.

\- మంగా (అవంతీపురం, బాధితురాలు)

'తుంగతుర్తి' కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు


మోరపాక సత్యంను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

అర్వపల్లి, అక్టోబరు 22: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం జాజిరెడ్డిగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. సోమవారం రాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గుడిపెల్లి మధుకర్‌రెడ్డికి మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు అర్వపల్లి పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. మొదటి నుంచి జెండా మోసిన కాంగ్రెస్ కార్యకర్తలను కాదని ఇటీవల వేరే పార్టీ నుంచి వచ్చిన కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారని డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇటీవల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆవిష్కరించారు. ఒకే స్టేజీపైకి పాత, కొత్త నాయకులను నిర్వహకులు పిలిచారు. స్టేజీపై డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు ఎమ్మెల్యే చెప్పకుండానే మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి పేర్లను పిలిచారు. తనను గెలిపించిన కాంగ్రెస్ కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని ఎమ్మెల్యే ఇటీవల వ్యాఖ్యానించారు. బేరగాళ్లు నావద్దకు రావద్దని ఎమ్మెల్యే అన్నారు. నిఖార్సైన కార్యకర్తలు నా దగ్గరికి వచ్చి పనులు చేయించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. అదే క్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, నర్సింగ్ శ్రీనివా‌స్‌గౌడ్ విలేకరుల సమావేశంలో బేరగాళ్లు ఎవరో ఎమ్మెల్యే చెప్పాలని మాట్లాడారు. ఎమ్మెల్యే అంటే గౌరవం ఉందని నిన్న, మొన్న వచ్చిన వారికి ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యం ఇవ్వడం తమకు నచ్చడం లేదన్నారు.

మా ఇంటిపై దాడి చేశారు

జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉన్న గ్రామంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం కొంత మందితో కలిసి మా ఇంటిపై దాడి చేశారని జిల్లా కాంగ్రెస్ యువజన ప్రధాన కార్యదర్శి గుడిపెల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. తనపై చేయి చేసుకున్నారన్నారు. తాము తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో పని చేస్తామన్నారు. దాడి చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దాడులకు పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో పీఏసీఎస్ ఛైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, దాసరి సోమయ్య, పాలెల్లి సురేష్, విక్రమ్‌రెడ్డి, రవీందర్‌నాయక్, గుడిపెల్లి సోమిరెడ్డి, భైరబోయిన మహరాజు, సైదులు, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్ పాల్గొన్నారు.

ఇంటికి పిలిపించి దాడి చేశారు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యంను జాజిరెడ్డిగూడెం గ్రామంలోని గుడిపెల్లి మధుకర్‌రెడ్డి ఇంటికి పిలిపించి దాడి చేశారని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దరూరి యోగనందచార్యులు తెలిపారు. అర్వపల్లిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిఖార్సైన కార్యకర్తలపై దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం కారు అద్దాలను పగులకొట్టారని తెలిపారు. 40ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నామన్నారు. ఎమ్మెల్యేతో తమకు ఎలాంటి విభేదాలు లేవన్నారు. నిన్న, మొన్న పదవుల కోసం వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వొద్దని అడిగినందుకు దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు.

సత్యంను పరామర్శించిన మాజీమంత్రి దామోదర్‌రెడ్డి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యంను మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మంగళవారం అర్వపల్లిలో పరామర్శించారు. ఘర్షణలకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, గుడిపాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, దరూరి యోగనందచార్యులు, నర్సింగ్ శ్రీనివా‌స్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.154	230	260
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.148	214	244

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	588.90
టీఎంసీలు	308.7614
ఎడమకాల్వకు నీటి విడుదల	6173
కుడికాల్వకు	10,040
విద్యుత్ కేంద్రం ద్వారా	29,597
క్రస్ట్ గేట్ల ద్వారా	15,928
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2400 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	1,21,990 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	66,482 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

\- నాగార్జునసాగర్, (ఆంధ్రజ్యోతి)

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	42.37 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	21,640
అవుట్‌ఫ్లో	16 వేల క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

\- మేళ్లచెర్వు,(ఆంధ్రజ్యోతి)

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	643.85 అడుగులు
టీఎంసీలు	4.16
ఎన్ని గేట్ల ద్వారా	2 గేట్ల ద్వారా
ఇన్‌ఫ్లో	1227.88 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	1077.87 క్యూసెక్కులు

\- కేతేపల్లి,(ఆంధ్రజ్యోతి)

శాలిగౌరారం

పూర్తి స్థాయి నీటిమట్టం	21 అడుగులు
ప్రస్తుత నీటిమట్టం	21 అడుగులు

\- శాలిగౌరారం,(ఆంధ్రజ్యోతి)

డిండి

పూర్తి స్థాయి నీటిమట్టం	36 అడుగులు
టీఎంసీలు	2.4
ప్రస్తుత నీటిమట్టం	36 అడుగులు
ఇన్‌ఫ్లో	3750 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	3750 క్యూసెక్కులు

-డిండి,(ఆంధ్రజ్యోతి)

కుమారులు ఉన్నా.. చేరదీయక

● స్పందించిన అధికారులు ఆస్పత్రిలో వృద్ధుడికి చికిత్స ● కుమారులకు కౌన్సిలింగ్



సూర్యాపేటటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టక కొడుకులు ఆదరించకపోవడంతో రోడ్డున తండ్రిని అధికారులు ఆదరించారు. ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో వేణుమాదవ్ వృద్ధుడి ముగ్గురు కుమారులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. తండ్రి యోగక్షేమాలు చూసుకోవాలని ఆదేశించారు.

కొడుకులు ఉన్నా..

పెన్‌పహాడ్ మండలంలోని లింగాల గ్రామానికి చెందిన మామిడి అంజయ్యగౌడ్‌కు ముగ్గురు కొడుకులు ఉన్నారు. అంజయ్య భార్య మూడు సంవత్సరాల క్రితం చనిపోయింది. కుమారులు అరవింద్, కృష్ణయ్య ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. రెండో కుమారుడు చంద్రం కూలి పనులు చేసుకుంటున్నాడు. అయితే అంజయ్యగౌడ్‌ను కొంతకాలంగా ముగ్గురు కుమారులు నెలకు ఒకరు చొప్పున తండ్రిని చూసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. ఇటీవల ఎవరూ కూడా ఆయనను పట్టించుకోవడంలేదు. దీంతో ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డు ఎల్ఐసీ కార్యాలయం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కుమారుడు కృష్ణయ్య ఇంటి ఎదుట పడుకొని న్యాయం చేయాలని అంజయ్య కోరాడు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో అధికారులు స్పందించారు.

ముషంపల్లిలో విద్యుదాఘాతంతో రైతు మృతి


శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

నల్లగొండ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా అడ్డువచ్చిన తీగలను తొలగించే ప్రయత్నంలో ఓ రైతులు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని ముషంపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ముషంపల్లికి చెందిన మాలిరెడ్డి శ్రీనివా‌స్‌రెడ్డి(40) తన వ్యవసాయ భూమిలో నిమ్మ, బత్తాయి తోటలు సాగు చేశాడు. వాటిని తొలగించి వరి పొలం అచ్చుకట్టేందుకు ట్రాక్టర్‌తో దున్నుతున్నాడు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. మధ్యాహ్నం 12గంటల సమయంలో పొలం దున్నేందుకు వెళ్లిన శ్రీనివా‌స్‌రెడ్డి సాయంత్రం నాలుగు గంటలైనా ఇంటికి రాకపోవడంతో భార్య అనిత శ్రీనివా‌స్‌రెడ్డికి ఫోన్ చేసింది. ఎంతసేపటికీ సమాధానమివ్వకపోవడంతో అనుమానంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లిచూడగా శ్రీనివా‌స్‌రెడ్డి విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ ఘటనపై శ్రీనివా‌స్‌రెడ్డి తండ్రి చెన్నారెడ్డి ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపారు. శ్రీనివా‌స్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మార్బుల్ బండలు పాలిష్ చేస్తుండగా..

కోదాడ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం గ్రామానికి చెందిన భూక్య శ్రీను(47) మార్బుల్ బండలు పాలిష్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నల్లబండగూడెం గ్రామంలోని సైదులు ఇంట్లో మార్బుల్ బండలు పాలిష్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామస్థులు శ్రీనును వెంటనే కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. శ్రీను భార్య సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి తెలిపారు. శ్రీనుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు.

144 కిలోల గంజాయి దహనం

భువనగిరి రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని ఆరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన 25 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 144 కిలోల గంజాయి, 4.5కిలోల గంజాయి చాక్లెట్లు, 40 మిల్లీ లీటర్ల ఆశిస్ ఆయిల్‌ను యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలోని రేమా ఇండస్ట్రీస్‌లో మంగళవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివా‌స్‌రెడ్డి మాట్లాడుతూ గంజాయిని వినియోగించినా, విక్రయించిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్లు ఎస్. సైదులు, బి. సంతోష్, ఆర్. లక్ష్మణ్‌నాయక్, భువనగిరి, సూర్యాపేట, కోదాడ, రామన్నపేట, చండూరు, ఆలేరు ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పైరు రంగు మారిందని కౌలు రైతు ఆందోళన

● దుకాణం ఎదుట కౌలురైతు కుటుంబం నిరసన

మిర్యాలగూడ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దామరచర్ల మండలం కేజేఆర్ కాలనీకి చెందిన ధనావత్ శ్రీహరి అనే కౌలు రైతుకు చెందిన మూడెకరాల వరిపైరును దోమ, ఆకుచుట్టుపురుగు, పొట్టకుళ్లు వ్యాపించింది. దాంతో రైతు ఈనెల 14వ తేదీన మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణంలోకి తెగుళ్లను అరికట్టేందుకు వ్యాపారి ఇచ్చిన మందులను పైరుకు పిచికారీ చేశాడు. వారం రోజు లు తరువాత పైరంతా ఎరుపెక్కి వరిగడ్డి రంగులోకి మారింది. తీవ్ర వేదనకు లోనవైన కౌలురైతు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం వ్యాపారి వద్దకొచ్చి నిలదీశాడు. పొంతనలేని సమాధానం చెప్పడంతో రైతు కుటుంబసభ్యులతో కలిసి సుమారు రెండుగంటలపాటు ఆందోళన చేశారు. అనంతరం సదరు వ్యాపారి రైతుతో రాజీపడి మరో మూడు రకాల మందులిచ్చి వినియోగించాలని సూచించాడు. అనంతరం మిర్యాలగూడ ఏఓ సైదానాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు రైతు శ్రీహరి తెలిపారు.

సిమెంటు పరిశ్రమను అడ్డుకుంటాం

● ప్రజల ప్రాణాలతో ఆడుకుంటుంటే చూస్తామా..?
● ఏకమై తరిమికొడతాం
● మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

భువనగిరి కలెక్టరేట్/భువనగిరి టౌన్/ రామన్నపేట, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో ఆడుకుంటే చూస్తూ ఊరుకోబోమని, తరిమికొడతామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. రామన్నపేటలో నెలకొల్పుతున్న సిమెంటు ఫ్యాక్టరీని రద్దు చేయాలనే డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రాణాలైన అర్పించి అంబుజా సిమెంటు ఫ్యాక్టరీని ఆపేస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసే వరకు తిరుగుబాటు చేస్తామని అన్నారు. ఈసందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ రామన్నపేట పరిధిలో డ్రైపోర్టు ఏర్పాటు చేస్తామని పలువురు రైతుల వద్ద గతంలో సుమారు 360 ఎకరాల భూమిని కొనుగోలు చేసి నేడు ఆ రైతుల ప్రాణాలను మింగే పరిశ్రమ నిర్మిస్తామంటే ఊరుకోబోమన్నారు. వ్యవసాయం, కులవృత్తులపై ఆధారపడిన ప్రజలకు పరిశ్రమ ఏర్పాటుతో గాలి, నీరు కాలుష్యకారంగా మారి వ్యవసాయం జరగక ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఉపాధి కోల్పోయి ప్రజలు వలసలు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. జనావాసాలకు దూరంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా ఎటూ చుట్టు రెండు కిలో మీటర్ల పరిధిలో ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతంలో ఏర్పాటు చేయడానికి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలన్నారు. మాజీ సీఎం కేసీఆర్ దయతో భూముల దరలు పెరిగితే రియల్ ఎస్టేట్ రంగంలో ఎంతో మంది ఉపాధి దొరికిందని అన్నారు. ఫ్యాక్టరీని నిలుపుదల చేయకుంటే తిరుగుబాటు చేస్తామని జైలుకైనా వెళతామని అన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనివ్వబోమని హెచ్చరించారు. ప్రజాఆరోగ్యం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామన్నారు. భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఇట్టబోయిన గోపాల్, నర్సింహ, నాకోటి నగేశ్, మల్లేశం, దయాకర్, బొక్క మాధవరెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భువనగిరిలో కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు

రాజకీయాలకు అతీతంగా వ్యతిరేకిద్దాం: అఖిలపక్షం

అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు కోసం బుధవారం జరిగే ప్రజాభిప్రాయ సేకరణను రాజకీయాలకతీతంగా వ్యతిరేకించి కాలుష్య పరిశ్రమను పారదోలాలని అఖిలపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. రామన్నపేటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ పరిశ్రమ మూలంగా రామన్నపేట పర్యావరణ ప్రజారోగ్యం దెబ్బతిని భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మండల ప్రజలంతా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని కంపెనీకి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్ల అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ.రేహన్, అఖిలపక్ష నాయకులు పల్లపు దుర్గయ్య, ఊట్కూరి నరసింహ, బొడ్డుపల్లి వెంకటేశం, గోదాసు పృథ్వీరాజ్, ఎండీ.ఫజల్‌బేగ్, జమీరుద్దీన్, నకిరెకంటి నరేందర్, గూనిరాజు, హనుమంతు, గొరిగె సోములు పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమ వద్దు: సీఐటీయూ

ప్రజల ప్రాణాలను హరించే కాలుష్య కారక పరిశ్రమ వస్తే మా బతుకులకు ఉరే అంటూ సిమెంట్ పరిశ్రమ గేటు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఉరితాళ్లతో మంగళవారం కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం మాట్లాడుతూ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే కాలుష్య కారక సిమెంట్ పరిశ్రమలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గొరిగే సోములు, గాదె నరేందర్, గాదె కృష్ణ, వంగాల మారయ్య, నకిరెకంటి రాము, మోటె అంజయ్య, ఏనుగ నరసింహ, రేగు అంజయ్య, గొరిగె మల్లేశం, రాసాల రమేష్, షానగండ వెంకటేశ్వర్లు, తరిగొప్పుల వెంకట్ రెడ్డి, తన్నీరు దుర్గారావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ

రామన్నపేట మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దంటూ ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ రాసింది. ఈ మేరకు సీఎంకు రాసిన బహిరంగ లేఖను సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ మంగళవారం భువనగిరిలో విడుదల చేశారు. సిమెంట్ పరిశ్రమ ప్రజారోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, పరిశ్రమ ఏర్పాటు చేసే స్థలం జనావాసాలకు సమీపంగా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటుతో వ్యవసాయ భూములపై ప్రభావం చూపుతుందని పాడి రైతుల జీవనాధారమైన పశువులకు గాసం దొరకని పరిస్థితి నెలకొంటుందన్నారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో పరిసరాలు కలుషితమవుతాయని గురువారం నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని లేఖలో సీఎంను కోరారు.



రామన్నపేట: అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత అశోక్‌రెడ్డి

పరిహారం సరే..ఇంటిస్థలమేదీ?

(5వ పేజీ తరువాయి)

పాత డిపోను నేటికీ తొలగించలేదు. అయితే డిపోను తొలగించి ఇక్కడ రహదారి బాధితులకు..200 గజాల చొప్పున ఇంటి స్థలం కేటాయిస్తూ గత ప్రభుత్వం రెవెన్యూశాఖ ద్వారా ఐదేళ్ల క్రితం ప్రొసీడింగ్స్ ఇచ్చింది. అయితే బస్‌డిపోను ఖాళీ కాకపోవడంతో బాధితులకు ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పటికైనా డిపోను ఖాళీ చేసి స్థలాన్ని తమకు స్వాధీనం చేయాలని బాధితులు కోరుతున్నారు.



త్వరలో ప్రభుత్వ విప్‌కు విన్నవిస్తాం

రోడ్డు విస్తరణలో దుకాణాలు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన బాధితుల కోసం గతంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కలిశాం. దీంతో దేవస్థానం బాధితులకు దుకాణాలు కేటాయించింది. అయితే ఇళ్ల స్థలాల విషయమై మరోసారి ప్రభుత్వ విప్‌ను కలుస్తాం. త్వరగా స్థలాలు వచ్చేలా కృషి చేస్తాం.

-గిరిధర్, రోడ్డు బాధితుల సంఘం ప్రధాన కార్యదర్శి



పరిహారం ఖర్చవుతోంది

రోడ్డు విస్తరణలో నష్టపోయిన మాకు ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అయితే సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. దీంతో అద్దె రూపంలో పరిహారం సొమ్ము ఖర్చవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంటి స్థలాన్ని వెంటనే మాకు అప్పగించాలి.

-గోర్ల జ్యోతిరవీందర్, బాధితురాలు



ఆర్టీసీ డిపో తరలింపునకు ఆదేశాలు లేవు

ఆర్టీసీ డిపోను మరోచోటికి తరలించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. డిపో తరలింపు విషయంపై రాష్ట్రస్థాయి అధికారుల వద్దే పూర్తి సమాచారం ఉంటుంది.

-శ్రీనివాస్‌గౌడ్, డీఎం

ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి: డీఈవో

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 : జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యాయని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని జడ్పీహైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడుతూ బోధనాపరమైన, ఇతర మౌలిక వసతులపై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలకు సంబంధించిన పనులను ఈనెల 25లోగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా బదిలీలు పూర్తి కావడంతో ఉపాధ్యాయుల కొరత లేదన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు పెద్దపీట

భువనగిరి రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం బొల్లేపల్లి జడ్పీ హైస్కూల్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ కనుకుంట్ల రేఖ బాబురావు అన్నారు. పాఠశాలలోని వరండా పై కప్పు శిథిలావస్థకు చేరి ఇటీవల కూలింది. మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 5లక్షల నిధులను మంజూరు చేసిందని అయితే ఎన్నికల నేపథ్యంలో ఆ నిధులు విడుదల కాలేదని, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించి నూతన పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఆయన వెంట మాజీ విద్యా కమిటీ చైర్మన్ హరిశంకర్, గ్రామస్థులు జిట్టా కృష్ణారెడ్డి, నాంపల్లి మల్లేశం, సత్యనారాయణ, యాదగిరి ఉన్నారు.

ఉపాధ్యాయుడి వెంకటచారికి ఎక్స్‌లెన్స్ అవార్డు

బీబీనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరావులపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గడబోజు వెంకటచారికి టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. విద్యారంగంలో చేసిన కృషికి గాను శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు 2024 సంవత్సరానికి గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బిర్ల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు.

ఆర్యవైశ్య మహాసభ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా శ్రీనివాస్

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా సముద్రాల ఐడియా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మలగారి శ్రీనివాస్ ఆయకు నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి బెజగం సంతోష్, తదితరులకు ఐడియా శ్రీనివాస్ కృతజ్ఞతులు తెలిపారు.

మోటకొండూరు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలి

మోటకొండూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 43 ప్రకారం మోటకొండూరు, ఆత్మకూర్ మండలలను కలిపి నూతన మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. మోటకొండూరు మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయకుండా ఆలేరు మార్కెట్ కమిటీలో మండలనికి చెందిన పలువురిని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే పక్షపాత ధోరణితో వ్యవహరిస్తూ జీవో 43ను తుంగలో తొక్కి మండలంలోని ట్రేడర్స్, రైతులను ఆలేరు మార్కెట్ కమిటీలో డైరెక్టర్లుగా నియమించడం సరికదన్నారు. తక్షణమే మండలం నుంచి నామినేటెడ్ చేసిన డైరెక్టర్ల నియామకలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం

రామన్నపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ టీఎం లక్ష్మారెడ్డి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్‌సీసీతో క్రమ శిక్షణ, దేశ భక్తి అలవరుతుందని అన్నారు. ఎన్‌సీసీతో విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్ ఖానం, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆఫీసర్‌గా డాక్టర్ రాచమల్ల శ్రీను, సుబేదార్ మేజర్ ఎల్ మాధవ రావు, సుబేదార్ జగన్నాథం, హవల్దార్ మల్లప్ప పాల్గొన్నారు.

సభ్యత్వం పెరిగితేనే బీజేపీ అధికారంలోకి

భువనగిరి టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వం పెరిగితేనే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం సాధ్యమవుతుందని పార్టీ సీనియర్ నేత, కేంద్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన బీజేపీ జిల్లా స్థాయి సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వ నమోదులో నిర్లక్ష్యం చూపితే పార్టీని మోసగించినట్లేనని నాయకులు, కార్యకర్తలు గ్రహించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి రవీందర్, పడాల శ్రీనివాస్, జిల్లా ప్రబారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రాచకొండ కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, చందా మహేందర్‌గుప్తా, ఊట్కూరి అశోక్‌గౌడ్, వేముల అశోక్, పడమటి జగన్‌మోహన్‌రెడ్డి, బలరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఏపీఆర్‌సీ పెండింగ్ బిల్లుల సాధన కోసం టీపీయూఎస్ (తపస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలిక పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆలేరులో నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని దీనివల్ల ఉపాధ్యాయులు ఆర్థికంగా ప్రతిసారి నష్టపోతున్నారని తపస్ జిల్లా బాధ్యులు దూడల వెంకటేష్ అన్నారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల ఇలానే చిన్న చూపు చూస్తే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికాల్లో ఫలితం అనుభవిస్తారన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మి, బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి మంజుల, స్కూల్ అసిస్టెంట్ రాష్ట్ర అధ్యక్షుడు పసుపులేటి నరేంద్రస్వామి, పోరెడ్డి రంగయ్య, రావుల సత్యనారాయణరెడ్డి, ఆర్ సైదులు, పరమేష్ పాల్గొన్నారు.

కందాల రంగారెడ్డి సహచరుడు వెంకటయ్య కన్నుమూత

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22 : సీపీఎం సీనియర్ నాయకుడు కందాల రంగారెడ్డి సహచరుడు గూని వెంకటయ్య మరణం పార్టీకి తీరని లోటు అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మంగళవారం భీమనపల్లిలో గూని వెంకటయ్య మృత దేహాన్ని సందర్శించిన సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి విప్లవాభివందనాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూని వెంకటయ్య (93) మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, ప్రసాదం విష్ణు పాల్గొన్నారు.

25నుంచి ఆర్ఆర్ఆర్ రైతుల అవార్డు ఎంక్వైరీ

భువనగిరి రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ కోసం ఇప్పటికే నేషనల్ హైవే అథారిటి 3జీ నోటిఫికేషన్ విడుదల చేసింది. భువనగిరి మండల పరిధిలోని గౌస్‌నగర్, కేసారి, ఎర్రంబెల్లి, తుక్కాపురం, పెంచికల్ పహాడ్, రాయిగిరిలో 15కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 328 సర్వే నెంబర్లలో 170 .53 ఎకరాలను సేకరించేందుకు రెవెన్యూ, నేషనల్ హైవే అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈనెల 25న గౌస్‌నగర్, కేసారం, 26న ఎర్రంబెల్లి, 28న తుక్కాపురం, 29న పెంచికల్ పహాడ్, 30న రాయిగిరి రైతులతో భువనగిరి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అవార్డు ఎంక్వైరీని భువనగిరి ఆర్డీవో పరంకుశం అమరేందర్ నిర్వహించనున్నారు. సంబంధిత రైతులు తమ భూములకు సంబంధించిన డాక్యుమెంటేషన్లను, బ్యాంకు పాస్‌పుస్తకం జిరాక్స్ పత్రాలను తీసుకురావాల్సి ఉంది. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్పే వరకు ఎలాంటి అవార్డు ఎంక్వైరీలు చేపట్టవద్దని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే అవార్డు ఎంక్వైరిని సమావేశాన్ని బహిష్కరిస్తామని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

'కోల్‌కతా ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి'



ఆరోగ్యం కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఆలేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతా ఘటనలో డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ డాక్టర్స్ డిమాండ్‌చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆలేరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. డబ్ల్యూబీజేడీఎఫ్ చేపడుతున్న పోరాటానికి ఐఎఫ్‌టీయూ సంఘీభావం తెలుపుతూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. డాక్టర్లు రజినీ, ప్రసాద్‌రావు, శ్వేత, రాహెల్, నర్సింగ్ స్టాఫ్ జి మంజుల, సుజాత, స్వప్న, కవిత, హరినాయక్, పీడీయస్‌యూ నాయకులు ఇక్కం సహదేవ్, గడ్డం నాగరాజు, బేజాడ కుమార్, ఇక్కం శ్రీనివాస్, ఆర్ ఉదయ్, ఎం ప్రవీణ్, వెంకటేష్ పంజాల మురళీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని వినియోగిస్తే కఠిన చర్యలు



గంజాయిని దహనం చేయిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): గంజాయిని వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలోని రేమా ఇండస్ట్రీస్‌లో మంగళవారం డ్రగ్ డిస్పోజల్ కమిటీ నల్లగొండ డివిజన్ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 3 జిల్లాలకు సంబంధించిన 6 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 25కేసుల్లో స్వాధీనం చేసుకున్న 144 కిలోల గంజాయి, 4.5కిలోల గంజాయి చాక్లెట్లు, 40మిల్లీ మీటర్ల ఆశిస్ ఆయిల్‌ను దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి , నల్లగొండ, సూర్యాపేట ఎక్సైజ్ సూపరిండెంట్లు ఎస్ సైదులు, బి సంతోష్, ఆర్ లక్ష్మణ్ నాయక్, భువనగిరి, సూర్యాపేట, కోదాడ, రామన్నపేట, చండూరు, ఆలేరు, ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

రాజాపేట: గ్రామాల్లో పైపులైన్లు, గేట్‌వాల్వ్ లీకేజీలను ఎప్పటికప్పుడు అరికడుతూ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలని మిషన్ భగీరథ, ఈఈ కరుణాకర్ కోరారు. రాజాపేట ఎంపీడీవో కార్యాలయంలో మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం నిర్వహించారు. ఏఈఈ వెంకటరమణ, ట్రైనర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

యాదగిరిగుట్ట రూరల్: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరేటి రాములు, ఎండి. ఇమ్రాన్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్యుల సమావేశం జరిగింది. సివిల్ సప్లై హమాలి సంఘం అధ్యక్షుడు పల్లె శ్రీనివాస్, కొల్లూరి మల్లేశ్, రాజు, ఆకుల శ్రీను, సాయినాథ్, పద్మ, అండాలు, వీరమని, నరిసంప్మా, కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

వలిగొండ: దేశంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వేములకొండ గ్రామంలో సీపీఐ గ్రామశాఖ సమావేశం జరిగింది. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎలగందుల అంజయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, నాయకులు అంజయ్య, మల్లేశం, శ్రీను, యాదయ్య, చక్రపాణి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రెండు పంటలకు సంబంధించిన రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ అన్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, నాయకులు పాండాల మైసయ్య, ఎదునూరి మల్లేశ్, పల్లెర్ల అంజయ్య, కొండమడుగు నాగమణి, ఎల్లయ్య, యాదగిరి ఉన్నారు.

వలిగొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య మండల కార్యదర్శి, సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని జాలుకాలువ గ్రామంలో శాఖ సమావేశం నిర్వహించారు. తుర్కపల్లి సురేందర్, సీనియర్ నాయకుల పబ్బు నారాయణ, నారీ రామస్వామి, సిర్పంగి కృష్ణయ్య, పరమేశా, మారయ్య, బిక్షపతి, బడేసాబ్ సుందరయ్య, సత్తయ్య రమేష్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సర్వసభ్య సమావేశం భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. భువనగిరిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ హనుమంతు కె జెండగే, రెండ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాములు అతిథులుగా రానున్నట్లు తెలిపారు.

తుర్కపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగ పెండింగ్, డీఏలు, ఆర్థిక పరమైన పెండింగ్ బిల్స్‌ను ప్రభుత్వం వెంటనే క్లియర్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే.జంగయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకుగాను మంగళవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముక్కెర్ల యాదయ్య, సంఘ నాయకులు సిల్వేర్ మహేశ్, పి. సుదర్శన్‌రెడ్డి, డివి రిషి, బిక్షమయ్య పాల్గొన్నారు.

రాజాపేట: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన ఉండాలని మండల పశువైద్యాధికారి చంద్రారెడ్డి కోరారు. రాజాపేట మండలం పాముకుంట, కాశగూడెం గ్రామంలో గాలికుంటూ వ్యాధి టీకాలను వేశారు. సిబ్బంది అశోక్, రాంచందర్ పాల్గొన్నారు.

మోత్కూరు: నిజాం ప్రభుత్వనికి వ్యతిరేకంగా పోరాడిన, పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా పాటుపడిన కొమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ కోరారు. కొమురం భీం జయంతిని పురస్కరించుకొని మంగళవారం మోత్కూరులో ఆయన చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. నాయకులు కె.నర్సయ్య. సి.హెచ్.ఉప్పలయ్య, ఎ. సైదులు, నాగప్ప, మల్లయ, నరసింహ మాట్లాడారు.

మోత్కూరు: తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిలా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు కవితల పోటీలు నిర్వహించనున్నట్లు తెలంగాణ సాహితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్ తెలిపారు. మంగళవారం మోత్కూరు ఉన్నత పాఠశాలల్లో ఆయన స్థానిక హెచ్‌ఎం. తీపిరెడ్డి గోపాల్ రెడ్డితో కలిసి కవితాల పోటీల కరపత్రాని ఆవిష్కరించారు.

గుండాల: మండలంలోని అనంతారం గ్రామంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా 150 పశువులకు టీకాలు వేశారు.

చౌటుప్పల్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కమిటీ డైరెక్టర్‌గా సునీల్‌కుమార్ నియమితులైన సందర్భంగా మంగళవారం పారా లీగల్స్ కమ్యూనిటీ సర్వేయర్స్ అసోషియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.శంకరయ్య, మంచాల నర్సింహ, సాయిలు ఉన్నారు.

బొమ్మలరామారం: మండలంలోని పిల్లిగుండ్ల తండా గ్రామ ప్రజలు గ్రామంలో మద్యం విక్రయం నిషేధిస్తున్నట్లు తీర్మాణించుకున్నారు. పిల్లిగుండ్లతండాలో నిర్వహించిన గ్రామ సభలో ప్రజలు, బెల్ట్ షాపుల యజమానులు చర్చించుకొని గ్రామంలో సంపూర్ణంగా మద్యపానం నిషేదానికి తీర్మాణం చేసుకున్నట్లు తెలిపారు. ఒప్పందాన్ని అతిక్రమించి ఎవరైనా మద్యం అమ్మినట్లయితే రూ.25వేల జరిమానాతో పాటు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అదించాలని తీర్మానించుకున్నట్లు తెలిపారు.

మోటకొండూరు : అర్హులైన ప్రతీ ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఓటరు నమోదు పత్రాలను అందజేశారు.

జీపీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం



ఎయిమ్స్ వద్ద అన్నదానం నిర్వహిస్తున్న జీపీఆర్ సేవాదళ్ ప్రతినిధులు

బీబీనగర్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోళి పింగల్ రెడ్డి జన్మదిన వేడుకలు జీపీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఎయిమ్స్ ఆసుపత్రి వద్ద రోగుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేయగా కొండమడుగు మెట్టు వద్ద మంగల మైసమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అంతకుముందు పార్టీలకతీతంగా పలువురు నేతలు తాజామాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పింగల్‌రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాసుల రఘునందన్ గౌడ్, మోహిన్, తుమ్మల నర్సింహారెడ్డి, ఎలుగుల నరేందర్, రవికుమార్, అజయ్‌కుమార్ ఉన్నారు.

అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పర్యాటక గ్రామంగా పేరొందిన పోచంపల్లి పట్టణ అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లిలో సీపీఎం రెండో పట్టణ మహాసభ గూడూరు రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన భూదాన్‌పోచంపల్లి రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న పోచంపల్లి పట్టణంలోని చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా చేస్తామని హామీలు ఇచ్చిన పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడలేదని విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. చేనేత వస్త్రాల తయారీదారుల సమస్యలను, కార్మికుల సమస్యలను, వస్త్ర వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పోచంపల్లి పేరుకే పర్యాటకం అని, సమస్యలు మాత్రం అనేకంగా ఉన్నాయన్నారు. కనీస వైద్య సాయం అందడం లేదన్నారు. పోచంపల్లి పట్టణంలో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి 24 గంటల వైద్య సదుపాయం అందించాలన్నారు. సీపీఎం పట్టణ నూతన కార్యదర్శిగా దుబ్బాక జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, పట్టణ కమిటీ సభ్యులు కోడె బాలనర్సింహ, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, పోనమోని కృష్ణ, బేతి కమలమ్మ, మండల కార్యదర్శివర్గ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, మధు పాల్గొన్నారు.



పోచంపల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

పట్టణ సమస్యలను పరిష్కరించాలి: సీపీఐ

యాదగిరిగుట్ట రూరల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం గుట్ట సీపీఐ కార్యాలయంలో సీపీఐ ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతగుట్ట రోడ్డు చౌరస్తా ఎదుట బోర్డ్స్ అడ్డంగా పెట్టడం, రోడ్డు పూర్తిగా శిథిలమైపోవడంతో పాతగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని భక్తులు దర్శించడానికి నిరాకరిస్తున్నారని, చౌరస్తా వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను బస్టాండ్‌లోకి వెళ్లకుండా రోడ్డుపైన నిలపడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందని, బస్టాండ్ ఆవరణలోని చిరువ్యాపారుల దుకాణాలు నడువకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బస్సులు బస్టాండ్‌లోకి వచ్చి ఆగివెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య, నాయకులు గోపగాని రాజు, పేరబోయిన బంగారి, ఆరె పుష్ప పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు